జయరావ్ పబ్లికేషన్స్, విజయవాడవారి ఆనంద నవలా చంద్రిక పోటీలో రు. 5000 బహుమతి పొందిన నవల




ఎం.డి. సౌజన్య

ఎస్.ఐ. లోపలికి వస్తూనే సెల్యూట్ చేసి "సార్! మీ అబ్బాయి మధ్యాహ్నం ఏదో రిక్షాలో వెళుతూ కనిపించాడు! నేను వున్న ట్రాఫిక్ సెంటరులో ఒక చిన్న యాక్సిడెంట్ అయితే ట్రాఫిక్ జామ్ అయ్యింది. అప్పుడే చూశాను మీ అబ్బాయిని. 'హలో అంకుల్' అన్నాడు.

"రోజూ మా పోలీస్ స్టేషన్ పక్కనే వున్న కాన్వెంట్ పిల్లలు కొందరు మా ఆఫీసు బయట వున్న వాటర్ కూలర్‌లో నీళ్ళు తాగి వెళుతుంటారు.

"అలా వచ్చే పిల్లల్లో మీ ప్రకాష్ నాతో మాట్లాడతాడు. అందుకే మధ్యాహ్నం రిక్షాలో ఎవరో ఆడమనిషితో వెళుతూ 'అంకుల్' అంటూ యాక్సిడెంట్ స్పాట్‌లో వున్న నన్ను పలకరించాడు. నేను అతని ప్రక్కనున్న ఆడమనిషి అబ్బాయి ఆయా అనుకున్నాను. అయితే ఇందాక మీ శ్రీమతిగారు ఆల్ సెయింట్స్ కాన్వెంట్‌కు మీ అబ్బాయి కనబడడంలేదని ఫోన్ చేశాక కాన్వెంట్ ప్రిన్సిపాల్ మాకు రిపోర్టు ఇచ్చింది. రిపోర్టు చూసి మీ అబ్బాయిని మధ్యాహ్నం రిక్షాలో చూసి వుండడంతో నేను బయల్దేరి వచ్చాను" అన్నాడు.

ఆ మాటలు వింటూనే ఆనందరావు నరనాడులు కృంగిపోయాయి.

'అయితే ... ప్రకాష్‌ను ఎవరో కిడ్నాప్ చేసి వుంటారా?

అనుమానంలేదు... పిల్లవాడిని కిడ్నాప్ చేశారు!

ఎవరు చేసి వుంటారు?

'ఆంధ్రా టెలిస్కోప్' పత్రికంటే గిట్టని వాళ్ళు - టెలిస్కోప్ పత్రిక వల్ల వాళ్ళ కూపీలు బయటపడ్డ వాళ్ళు ఎందరో వుంటారు!

వాళ్ళలో ఎవరైనా కావచ్చు?!

ఎవరై వుంటారు... ...'

ఫోను మోగింది.

"హలో... హియర్ ఆనందరావ్ స్పీకింగ్"

"మీ పిల్లవాడు మాయమయ్యాడు కదూ...!?"

అంది అదే కంఠం-ఎక్స్ గొంతు నవ్వుతూ.

"ఎవరు నువ్వు?" అరిచాడు ఆనందరావు.

"మిస్టర్ ఎక్స్‌ని" అన్నది కంఠం.



## జరిగిన కథ

రహస్య స్థలంలో శిష్యుల్ని సమావేశ పరచిన లామా కొన్ని శతాబ్దాల క్రితం హతులైన పెద్ద పండితుల సమాధులు గాలించి, నిక్షిప్తమైన తాళ పత్రాలు వెలికి తియ్యవలసిందిగా ఆజ్ఞ ఇచ్చాడు....

'సర్కస్ అగ్ని ప్రమాదాల వెనుక అదృశ్య హస్తాలు' అన్న వ్యాసం పై వారం అచ్చు వెయ్యబోతున్నట్టు ప్రకటించిన 'ఆంధ్రా టెలిస్కోప్' సంపాదకుడు ఆనందరావును 'మిస్టర్ ఎక్స్' బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు. ఆనందరావు లొంగనందువల్ల దుండగులు పత్రిక వ్యాన్ నాశనం చేసి, అతని అంగరక్షకులిద్దర్ని చంపి, కొడుకు ప్రకాష్‌ను ఎత్తుకుపోయారు.

- ఇక చదవండి

## 3

"మిస్టర్ ఎక్స్... అంటే... ఎవరు నువ్వు?' అన్నాడు ఆనందరావు రిసీవర్ పట్టుకున్న చేతిని వణక్కుండా గట్టిగా బిగిస్తూ. "ఇందాక షాక్ ట్రీట్‌మెంట్‌కు రెడీగా వుండమని హెచ్చరించాను? పాపం షాక్‌లో మర్చిపోయావేమో!" అన్నాడు ఆ వ్యక్తి.

"ఇడియట్! ఎవరు నువ్వు!? అయితే... మా ప్రకాష్‌ని... నువ్వే కిడ్నాప్ చేశావా?" అన్నాడు ఆనందరావు వణికిపోతూ.

"ఔను! ఇందాకే నిన్ను హెచ్చరించాను! నీ ఫియట్ కారుతో నువ్వు మీ ప్రకాష్, చదివే ఆల్ సెయింట్స్ కాన్వెంట్‌కు వచ్చివుంటే... ఈ కిడ్నాపింగ్ జరిగి